# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 21-05-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా నిన్న జరిగిన ఐదో దశ పోలింగ్‌లో మొత్తం 60.09 శాతం మేర ఓటింగ్ నమోదైనట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది.**
2. **జనన మరణ ధ్రువీకరణ పత్రాలకు సంబంధించి అమల్లోకి వచ్చిన కొత్త విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు ఆదేశించారు.**
3. **ఉత్తరాఖండ్‌లోని చార్‌ధామ్ యాత్రకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తుండడంతో.. ఆఫ్‌లైన్ రిజిస్ట్రేషన్ ను మే 31వ తేదీ వరకు నిలిపివేశారు.**
4. **ఐపీఎల్‌లో భాగంగా ఈరోజు కోల్‌కతా నైట్ రైడర్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల అహ్మదాబాద్‌లో తొలి క్వాలిఫయర్ మ్యాచ్ జరగనుంది.**
5. **ఈరోజు జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినం పాటిస్తున్నారు.**

==========================

లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా నిన్న జరిగిన ఐదో దశ పోలింగ్‌లో మొత్తం 60.09 శాతం మేర ఓటింగ్ నమోదైనట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఆరు రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 49 నియోజకవర్గాల్లో పోలింగ్ జరిగింది. కేంద్ర ఎన్నికల సంఘం గణాంకాల ప్రకారం జమ్మూ కాశ్మీర్‌లోని బారాముల్లాలో 35 ఏళ్లలో అత్యధికంగా 56.73 శాతం మేర ఓటింగ్ నమోదైంది. బీహార్‌లో 54.85 శాతం, జార్ఖండ్‌లో 63.07 శాతం, లడఖ్‌లో 69.62 శాతం, మహారాష్ట్రలో 54.29 శాతం, ఒడిశాలో 67.59 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 57.79 శాతం పోలింగ్ నమోదైంది. పశ్చిమ బెంగాల్‌లో దాదాపు 74.65 శాతం పోలింగ్ నమోదైంది. ఉత్తరప్రదేశ్‌లో 14, మహారాష్ట్రలో 13, పశ్చిమ బెంగాల్‌లోని 7, ఒడిశా, బీహార్‌లో ఐదు, జార్ఖండ్‌లోని 3, జమ్మూ కాశ్మీర్, లడఖ్‌లోని కేంద్ర పాలిత ప్రాంతాలలో ఒక్కో స్థానానికి పోలింగ్ జరిగినట్లు కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంది.

--------------------------

జనన మరణ ధ్రువీకరణ పత్రాలకు సంబంధించి అక్టోబర్ ఒకటి 2023 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు ఆదేశించారు. పునరుద్ధరించిన సీఆర్ఎస్ పోర్టల్ పై నిన్న విజయవాడలో జిల్లాల వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, రాష్ట్రస్థాయి అధికారులు, జనన మరణ రిజిస్ట్రార్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని

నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న సీఆర్ ఎస్ పోర్టల్‌లో రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా పలు మార్పులు తీసుకొచ్చిందని వివరించారు. ఎవరైనా ప్రాంతీయ భాషలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వెసు లుబాటు ఉందన్నారు.

----------------------------

కొత్తగా డ్రైవింగ్ నేర్చుకుని, లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకునే ప్రక్రియపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలు అవాస్తవమని గుంటూరు ఉవ రవాణా కమిషనర్ షేక్ కరీం తెలిపారు. ఆకాశావాణితో ఆయన మాట్లాడుతూ గుంటూరు జిల్లా వ్యాప్తంగా 13 డ్రైవింగ్ స్కూళ్లకు అనుమతి ఇచ్చామని, వీటిలో ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్ కూడా ఉందని తెలిపారు. తాజాగా ఈ డ్రైవింగ్ స్కూళ్ల వారే లైసెన్సులు కూడా ఇవ్వనున్నారని సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలు అవాస్తవమని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఇటువంటి మార్గదర్శకాలేవీ లేవని ఆయన స్పష్టం చేశారు.

----------------------------

ఉత్తరాఖండ్‌లోని చార్‌ధామ్ యాత్రకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తుండడంతో.. ఆఫ్‌లైన్ రిజిస్ట్రేషన్‌ను మే 31వ తేదీ వరకు నిలిపివేశారు. ఛార్‌ధామ్ యాత్రకు సంబంధించి నిన్న డెహ్రాడూన్‌లో జరిగిన సమావేశంలో ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ఈ ఆదేశాలు జారీ చేశారు. భక్తుల రద్దీని నియంత్రించేందుకు మార్గదర్శకాలను రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇదిలా ఉండగా ఉత్తరాఖండ్‌లోని నాలుగు ధామ్‌లలో భక్తుల యాత్ర సజావుగా సాగుతోంది. గత 10 రోజులలో సుమారు 7 లక్షల మంది భక్తులు కేదార్‌నాథ్, బద్రీనాథ్, గంగోత్రి, యమునోత్రి ధామ్‌లను సందర్శించారు.

----------------------------

ఇండియన్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా ఈరోజు రాత్రి 7 గంటల 30 నిమిషాలకు కోల్‌కతా నైట్ రైడర్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య అహ్మదాబాద్‌లో తొలి క్వాలిఫయర్ మ్యాచ్ జరగనుంది. రేపు రాజస్థాన్ రాయల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య అహ్మదాబాద్‌లో రెండో క్వాలిఫయర్ మ్యాచ్ జరగనుంది.

----------------------------

శాంతి..., సామరస్యాలను పెంపొందింపచేసి .... ప్రజలలో ఐక్యతా భావనను పాదు కొల్పజేయడం...., ఉగ్రవాద చర్యలను అరికట్టడమే లక్ష్యంగా ఈ రోజు జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినం పాటిస్తున్నారు. 1991 వ సంవత్సరం మే 21వ తేదీన తమిళ టైగర్ల ఆత్మాహుతి దళం జరిపిన బాంబు దాడిలో మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ హత్యకు గురైన ఈ రోజును ఉగ్రవాద వ్యతిరేక దినంగా పాటిస్తున్నారు. ఉగ్రవాదం, హింసాకాండలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్య పరచడం, ఉగ్రవాదం వల్ల కలిగే దుష్ప్రభావాలను ప్రజలకు తెలియజేయడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్యోద్దేశం.

----------------------------

మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం ద్వారా ఆయనకు నివాళులర్పించారు. న్యూఢిల్లీలోని వీర్‌భూమిలో రాజీవ్ గాంధీ సమాధి వద్ద కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీ, కాంగ్రెస్ పార్లమెంటు సభ్యులు రాహుల్ గాంధీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ సోమాజిగూడలోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళి అర్పించారు.

----------------------------

శ్రీలంకలోని సీతా అమ్మన్ ఆలయానికి ఆదివారం నిర్వహించిన కుంభాభిషేకం కార్యక్రమంలో శ్రీలంక, భారత్, నేపాల్‌కు చెందిన వేల మంది భక్తులు పాల్గొన్నట్లు భారత హైకమిషన్ సామాజిక మాధ్యమం ద్వారా నిన్న తెలిపింది. సీతా ఎలియా అనే గ్రామంలో జరిగిన ఈ వేడుకలో అయోధ్య నుంచి ప్రవహించే పవిత్రమైన సరయు నది జలాలను ఉపయోగించారు. ఈ కార్యక్రమానికి శ్రీలంకలో భారత హైకమిషనర్ సంతోష్ ఝా హాజరయ్యారు. భారత్, నేపాల్ దేశాలు అందించిన వస్త్రాలతో పాటు, తిరుపతి నుంచి పంపించిన ప్రసాదాలను సీతా దేవికి సమర్పించడంతో ఈ కార్యక్రమం ముగిసింది.

---------------------------

ఎస్.బి.ఐ రివార్డ్ పాయింట్ల పేరుతో జరుగుతున్న సైబర్ నేరాలపై స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎస్‌బీఐ స్పందించింది. రివార్డు పాయింట్లకు సంబంధించి తాము ఎలాంటి లింకులు పంపబోమని స్పష్టం చేసింది. ఇలా వాట్సప్, ఎస్ఎంఎస్‌లో వచ్చే ఎలాంటి లింకులను క్లిక్ చేయొద్దని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

---------------------------

అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం చింతూరు డివిజన్ పరిధిలోని గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి రేపు కౌన్సిలింగ్ నిర్వహించనున్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను చింతూరు, రంపచోడవరం డివిజన్‌లోని 8 గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం సీట్లకు రేపు ఉదయం 9 గంటల నుంచి పదో తరగతి పరీక్షలలో విద్యార్థులు సాధించిన మార్కుల ఆధారంగా కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఒక ప్రకటనలో తెలిపారు.

---------------------------

విజయనగరం పైడితల్లి అమ్మవారి మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. వనంగుడిలో నిన్న సాయంకాలం అమ్మవారికి స్నపనం, పంచామృతాభిషేకం నిర్వహించి ఉత్సవ విగ్రహంతో ఆలయ ప్రదక్షిణలు చేశారు. అనంతరం ప్రత్యేక రథంపై ఉంచి మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా హుకుంపేట చదురుకు చేర్చారు. ఇక్కడ నుంచి ఈరోజు వేకువజామున మూడు లాంతర్లు దరి చదురుగుడికి చేరుకున్నారు. అక్కడ అమ్మవారు ఆరునెలల పాటు భక్తులకు దర్శనమిస్తారు.

---------------------------

తిరుపతి గోవిందరాజస్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈరోజు ఉదయం స్వామివారు హనుమంతవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో ముఖ్య ఘట్టమైన గరుడ వాహన సేవ నిన్న రాత్రి జరిగింది.

---------------------------

తిరుపతి గంగమ్మ ఆలయంలో ఈరోజు గంగ జాతర ఘనంగా జరుగుతోంది. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు ఆలయ ఆవరణలో పొంగళ్ళు పెడుతూ అమ్మవారిని సేవిస్తున్నారు. వివిధ రకాల వేషధారణలతో గంగమ్మకు మొక్కులు సమర్పించుకుంటున్నారు. సున్నపు కుండలు నెత్తిపై పెట్టుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గంగమ్మ తల్లిని శక్తి స్వరూపిణిగా అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతిస్తున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి తిరుపతి గంగమ్మ జాతరకు వచ్చే భక్తులకు అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరపున తిరుపతి గంగమ్మకు పట్టువస్త్రాలను సమర్పించారు.

====================